ప్రియదత్త - 26-02-2003

# శాపగ్రస్తులు

చీకటి ఆవరించిన రాత్రిలో రైలు పట్టాలు కబళించడానికి మాటువేసి మందకొడిగా నిద్రనటిస్తోన్న కొండచిలువల్లా, ఉత్తర దక్షిణాలుగాపడి ఉన్నాయి. రైలుకట్ట దిగువగా రెండువైపులా, గుర్రపు డెక్కలతో నిండిన బురద కాలువలు మాయ తివాచీలు కప్పిన ఊబికందకాల్లా ఉన్నాయి, రైలుకట్టకి పడమరగా ఉన్న జొన్నచేలు ఏపుగా పెరిగాయి. పైరుగాలికి ఊగిసలాడుతున్న జొన్నకంకులు, చీకట్లో ఒకరినొకరు స్పర్శించుకొంటోన్న ప్రేమికుల్లా ఉన్నాయి.

చేనుకి మధ్యగా పదడుగుల ఎత్తు మంచె మీద, గడ్డి పరకల ఒత్తులో వెల్లకిలా పడుకొని, ఆకాశంలోకి చూస్తున్నాడు రాజయ్యదొర పెద్దకొడుకు సోందొర. అమావాస్య యామినీకాంత ఆకాశంలో చీకటి నీళ్ళ కళ్ళాపి జల్లితే, పొరపాటున ఆ నీళ్ళతో పాటు వెదజల్లబడ్డ మాణిక్యాల్లా నక్షత్రాలు మిలమిలా మెరుస్తున్నాయి. వీస్తున్న పైరుగాలి సవ్వడి కీచురాళ్ళ రొదలో వినిపించకపోయినా మేని స్పర్శతో తానూ ఉన్నానని తెలియజేస్తోంది. రత్నాలు పొదిగిన నల్లటి మేలిముసుగు కప్పుకొని నిద్రపోతున్న భామలా, నక్షత్ర దీపాలు వ్రేలాడదీసిన పందిరి కింద భూమి నిద్రపోతోంది. ఆ రాత్రి చీకటి చాలా అందంగా ఉంది. చీకటి ప్రసాదించే నిద్రనీ, నిద్ర ప్రసాదించే మనసు ప్రశాంతతనీ పోగొట్టుకొన్న సోందొర గతపు టాలోచనలతో సతమతమవు తున్నాడు.

దానధర్మాలకి పెట్టింది పేరు రాజయ్యదొర వంశం. రాజయ్యదొర ఇంటి దర్పానికీ, పతనానికీ ఒక విధంగా ఆ కీర్తికండూతే కారణం అని చెప్పుకోవచ్చు. పాతిక ఎకరాల మాగాణితో, వంద ఎకరాల మెరకతో స్వతంత్రంగా జీవితం మొదలు పెట్టిన రాజయ్యదొర దిట్టమైనవాడైనా మనసు మెత్తనివాడు కావడంతో నా అన్నవాళ్ళ మోసాలతో, దోచుకొన్నవాళ్ళ దౌర్జన్యాలతో దెబ్బతిన్నాడు. తన పేరు మంచి కోసం ఊరు మంచి ధ్యేయంగా పెట్టుకొన్న రాజయ్యదొర తన ఇంటి సంగతికాని, కన్న ఎనమండుగురు సంతానం సంగతికాని ఒక విధంగా నిర్లక్ష్యం చేశాడనే చెప్పుకోవాలి.

ఆ ఎనమండుగురిలోనూ అగ్రజుడు ప్రస్తుతానికి ముప్పై ఆరో పడిలో ఉన్న సోందొర. ఆతర్వాత వరుసగా ఐదుగురు చెల్లెళ్ళు. అప్పటికి తల్లి మళ్ళీ గర్భంతో ఉంది. ఆ కాలంలోనే, పదవిలో ఉన్న ప్రధాని కొడుకు తల్లి అధికారాన్ని వినియోగించడంతో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మీద విరుచుకుపడ్డాయి. నయానో, భయానో తలలూపించి కనబడిన వాళ్ళనల్లా శిబిరాల్లో బల్లలెక్కించి నరాలు కోసి పంపించారు. కొంతమందికి నూటయాభైలూ, మరికొంత మందికి

రొక్కంతోపాటు స్వచ్ఛంద సంస్థలందించిన నేతి డబ్బాలూ, బాస్మతీ బియ్యాలూ, చేతివాచీలూ ముట్టాయి. మరికొంతమంది విషయంలో కోతలు వారు కోయించుకున్నా, వాళ్ళ కిచ్చిన వాటిని కోతలు కోయించిన దళారులు ఎగరవేసుకు పోయారు. ఆ విషయంలో చాలా చర్చలు జరిగాయి. సోందొర తన తొమ్మిదేళ్ళ వయసులో కొంత కొంతగా అర్థం చేసుకోగలిగాడు.

సోందొరకి అర్థమైన సంగతీ, జ్ఞాపకమున్న సంగతీ ఏమిటంటే - రాజయ్యదొరకి తమ వంశధారకి ప్రభుత్వం వాళ్ళు అడ్డు కట్టడం ఇష్టం లేకపోయింది. రాత్రికి రాత్రి రాజయ్య దొర రైలెక్కేసి, ఎక్కడో అరకులో ఉన్న తన అక్కగారి పల్లెకు చేరుకొన్నాడు. ప్రభుత్వం వాళ్ళు శిబిరం ఎత్తేసిన కొన్నాళ్ళకు మళ్ళీ ఊళ్ళో తిరిగి అడుగు పెట్టాడు. సోందొరకి వయసొచ్చి పూర్తిగా విషయాలర్థమైన తర్వాత తండ్రి మీదా, ప్రజల మీదా, రాజకీయపార్టీ నాయకుల మీదా మనసులో కోపం పెంచుకొన్నదీ విషయంలోనే. చాలామంది అప్పట్లో జరిగిన కొన్ని అవాంఛనీయమైన సంఘటనల్నే వేలెత్తి చూపారు కాని, దేశానికి భావిలో జరిగే మంచిని గురించి ఆలోచించలేదు. ఆ కోపానికి కారణం ఆస్తిలో వాటాదారులు పెరిగారని కాదు కాని, ఉన్నదంతా కరిగిపోతోంటే ఇంత మందిని ఎలా పెంచుతామన్న ఇంగితజ్ఞానం తల్లిదండ్రులకు లేనందుకు.

అర్థంపర్థం లేని సంప్రదాయాల కోసం, అనవాయితీల కోసం చేతికందుబాటులో ధనం కోసం ఋణాలు చేయడం, ఆ బాకీలు తీర్చడం కోసం ఎకరాల నమ్మడం తండ్రి రాజయ్యదొరకు అలవాటైపోయింది. గొప్పవాళ్ళన్న ముద్ర పడిన తర్వాత వాళ్ళ ప్రస్తుత పరిస్థితులూ, వాస్తవాలూ ఎలా ఉన్నా రాబందుల్లా పీక్కుతినే బంధువులూ, ఏ కాలంలోనో వీళ్ళ తాతముత్తాతలెవరి నెత్తినో శఠగోపం పెట్టి ఇంతలేసి ఆస్తులు సంపాదించి ఉంటారు కాబట్టి, వీళ్ళని దోచుకుంటే దోషం లేదని ఆలోచించే ఆధునిక మురాలూ రాజయ్యదొరకి కష్టాలూ, నష్టాలూ కలుగజేస్తూ వచ్చారు. కొంతమంది ఉగ్రవాదులచే అపహరించబడ్డ ఇద్దరు తమ్ముళ్ళనీ విడిపించుకునే ప్రయత్నంలో, నలభై ఎకరాల మెరకని ఒక్క రోజులో అమ్మవలసి వచ్చింది తండ్రి రాజయ్యదొరకి.

ఆ నేపథ్యంలో చదువుతున్న పదో క్లాసుకి స్వస్తి చెప్పి, పారా, పలుగూ పట్టుకొని అప్పటికి మిగిలిన తమ పొలంలో తన పదహారో ఏట అడుగు పెట్టడం సోందొర జ్ఞాపకాలలో చాలా చేదుజ్ఞాపకం. అయిదుగురు చెల్లెళ్ళ వివాహాలూ అయ్యేసరికి దాదాపు ఉన్నదంతా హరించుకుపోయి, చివరికి బొజ్జన్నకొండ దిగువ అంచు నుంచి రైలుకట్ట పక్కనున్న గుర్రపుడెక్క కాలువ వరకూ ఉన్న ఈ రెండెకరాల చీలిక మిగిలింది. బెంగతో క్రుంగిపోయిన తల్లిదండ్రులు మిగిలారు. కాలేజీలో చదువులింకా పూర్తికాని తమ్ముళ్ళు మిగిలారు. తల్లిదండ్రులు చేసిన తప్పుకి ప్రాయశ్చిత్తంగా తను విధించుకున్న బ్రహ్మచర్యం మిగిలింది.

అయితే తమదంటూ, తమకంటూ మిగిలిన ఈ కాస్త భూమ్మీదా పడుకునే హక్కు ఈ రాత్రి తెల్లారితే హరించుకుపోతుంది. తన ఆఖరి మేనత్త మూడో కూతురు పెళ్ళి కోసమని తండ్రి రాజయ్యదొర మూడేళ్ళ క్రితం తీసుకున్న అప్పుకి, అసలు మాట దేముడెరుగు వడ్డీ కూడా చెల్లించలేక పోవడంతో, కోర్టు ప్రతినిధుల సమక్షంలో ఈ నేల కూడా వేలం కాబోతోంది.

కొంతమందికి పట్టిందల్లా బంగారమైతే, మరికొంతమందికి ఉన్నదంతా ఊడ్చుకుపోతుంది. కొన్ని తరాల వ్యవధిలో ఈ చక్రభ్రమణాలు జరుగుతూనే ఉంటాయి. అయితే తన జ్ఞాపకాల్లో చూస్తుండగానే చితికిపోయిన సంసారాల్లో తమదీ ఒకటి. సోందొరకి తల్లిదండ్రులూ, ఇద్దరు తమ్ముళ్ళూ మరోసారి మదిలో మెదిలారు.

భవిష్యత్తు గడిచేదెలా? తమ్ముళ్ళ చేతికి డిగ్రీలు రావాలంటే ఇంకా ఐదారు నెలలకి పైగా పడుతుంది. పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీలు, ఇంజనీరింగ్ డిగ్రీలు చేబట్టి కూడా, ఉద్యోగాలు దొరక్క, గోళ్ళు కొరుక్కుంటూ కూర్చుంటున్న నిరుద్యోగుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంటే, గోరుచుట్టు మీద రోకటిపోటులా ప్రతి పైమెట్టు చదువుకీ ప్రవేశ పరీక్షలూ, ప్రతి ఉద్యోగానికీ పోటీ పరీక్షలూ, ఈ పరీక్షలకీ శిక్షణనిచ్చే విద్యావ్యాపార కేంద్రాలూ, అదనపు అర్హతలకీ కంప్యూటర్ కోర్సులూ - వీటన్నింటికీ అయ్యే ఖర్చులు సామాన్య జనాల నడుములు విరగ్గొడ్తున్నాయి. ఈ ఇనపచట్రంలో తన తమ్ముళ్ళ భవిష్యత్ ఏమిటి?

అసలు, చదువు పూర్తవడం మాటటుంచి, పంటమీదనున్న పొలం పరాక్రాంతమైపోతోంటే, పూట గడిచేదెలా? సోందొరకి తండ్రి మీద మరోసారి అమితంగా కోపం ముంచుకొచ్చింది. మరుక్షణంలో, సాంప్రదాయాల వలయంలో చిక్కుకుపోయి, నిస్వార్థమైన జీవితం గడిపిన తల్లిదండ్రుల మీద వెల్లువలా జాలి పొంగుకొచ్చింది. 'మంచి చేసిన వాళ్ళకి దేముడు మేలు చెయ్యక మానడు' అని అన్ని మతాలూ చెప్పే శాంతి ప్రవచనం మనసులో చోటుచేసుకోగా, కొంచెం కష్టంతో మగతనిద్రలోకి జారుకున్నాడు సోందొర.

ఉన్నట్టుండి మెలకువ వచ్చిన సోందొర బోర్లాదొర్లి, మోచేతుల మీద ఆనుకుని, అరచేతుల్లో గడ్డాన్ని ఆన్చి ఆ చీకట్లోకి దృష్టి సారించాడు. దూరంగా రైలుకట్ట నుంచి తూర్పు వైపు వేగంగా సాగిపోతున్న ఆరీ, వెలిగే టార్చిలైట్ల వెలుతుర్లు! ఇంత రాత్రివేళ వాళ్ళేం చేస్తున్నారు? ఎవరు వాళ్ళు? లైన్‌మెన్‌లయితే పట్టాల వెంబడే వెళ్తారుగాని, రైలుకట్టకి దూరంగా ఎందుకు పోతారు?! సోందొరకి ఒక్కసారిగా ముచ్చెమటలు పోశాయి. కొంపదీసి వాళ్ళు విద్రోహక చర్యలకు పాల్పడే తీవ్రవాదులుగానీ, ఉగ్రవాదులుగానీ, లేదా శత్రుదేశపు గూఢచారులు కానీ కాదు కదా?!

ఈ ఆలోచన రాగానే సోందొర మరి ఆలస్యం చేయలేదు. ఒక్క ఉదుటున లేచి, పక్కనే ఉన్న టార్చిలైటును పట్టుకుని మంచెమీద నుంచి కిందకు దిగాడు. జొన్నచేను మధ్య అలవాటైన కాలిబాటని టార్చి వెలుతుర్లో చూసుకుంటూ వడివడిగా రైలుకట్ట వైపు అడుగులు వేశాడు. చింతాలమ్మ తులసికోట సమాధి దగ్గర, గుర్రపు డెక్కల కాలువ మీదనున్న మూడు తాటి దూలాల కాలి వంతెన మీదుగా నడుచుకుంటూ రైలుకట్ట ఎక్కాడు. అంతా నిర్మానుష్యంగా ఉంది. రైలుకట్టకి అవతలివైపు తూర్పు దిశగా దృష్టి సారించాడు. అంతా అంధకారమే తప్ప, మంచె మీద నుంచి ఇందాక చూసిన వెలుతురు వలయాలు కనిపించలేదు. రైలుకట్టకి తూర్పు వైపునున్న గుర్రపు డెక్కల కాలువకు ఆవతలి గట్టునున్న చింతాలయ్య తులసికోట సమాధి తెల్లగా కనిపించింది. అలవాటైన దృశ్యం కాబట్టి సరిపోయిందిగాని, కొత్తవాళ్ళెవరైనా ఆ రెండు

సమాధుల్ని చీకట్లో చూస్తే వళ్ళు జలదరించక మానదు.

సోందొర టార్చిలైటుని పట్టాల వైపు తిప్పి చూసి ఒక్కసారిగా స్తంభించిపోయాడు. విశాఖ వెళ్ళే లైనులోనూ, విశాఖ నుంచి వచ్చే లైనులోనూ తనకు పదడుగుల దూరంలో ఒక్కొక్క పట్టా తొలగించబడి ఉంది. తను నిల్చున్న చోటుకి దక్షిణంగా దాదాపు కిలోమీటరు దూరంలో 'బొజ్జన్నకొండ హాల్ట్' అనే చిన్న స్టేషన్ ఉంది. అటువైపు చూశాడు. స్టేషన్‌కి దగ్గరగా ఉన్న సిగ్నల్ స్తంభంమీద ఎర్రదీపం సోందొరకు అంత దూరం నుంచీ స్పష్టంగా కనబడింది. అంటే ప్రస్తుతానికి విశాఖ వైపు నుంచి ఏ బండీ రావట్లేదన్న మాట. మరి అటునుంచో? తెలుసుకొనే అవకాశం తనకు లేదు. ఆ లైను సిగ్నలు తనకు కనబడు.

సోందొర మరి ఆలోచనలతో సమయం వృథాచెయ్యకుండా ఒక్కసారిగా వళ్ళు విదిలించుకుని స్టేషను వైపు పట్టాల మధ్యగా పరుగెత్తసాగాడు. నాలుగైదుసార్లు కిందపడి లేచాడు. కాళ్ళూ చేతులూ గీరుకొని కారుతోన్న రక్తాన్ని లెక్కచెయ్యకుండా, గుండెల్లోంచి వస్తున్న నొప్పిని మధ్యమధ్య పంటి కింద బిగపడ్తూ పరుగెత్తి పరుగెత్తి స్టేషను చేరుకొన్నాడు. ప్లాట్‌ఫారం ప్రశాంతంగా నిద్రపోతోంది. నిస్సత్తువ చేరుకొంటున్న శరీరంలోంచి చివరి ప్రయత్నంగా శక్తినంతా కూడగట్టుకొని, స్టేషను మాస్టరు గది చేరుకొన్నాడు.

అరవై కేండిల్ బల్బు వెలుతుర్లో ఏదో పత్రిక చదువుకుంటున్న స్టేషన్ మాస్టర్ చిదంబరం గుమ్మంలో అలికిడి విని తలెత్తి చూశాడు. ఒక్క ఉదుట్లో కుర్చీలోంచి లేచి, రొప్పుతూ తూలిపడబోయిన సోందొరని పొదివి పట్టుకొని, "ఏం జరిగిందం"టూ పక్కనే ఉన్న కర్ర సోఫా, మీద కూర్చోబెట్టాడు.

"సమాధుల దగ్గర రెండు లైన్లలోనూ ఎవరో పట్టాలు తొలగించారు!" – ఆయాసంతో వగురుస్తూ అతికష్టంమీద తను చెప్పవలసిన రెండు ముక్కలూ చెప్పేసి, గుండెల మీద చేతులు వేసుకుని సోఫాలో కాళ్ళు చాపి పడుకొని, చెదిరిన శ్వాసనీ, ఎగిసెగిసి పడుతోన్న గుండెనీ అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చెయ్యసాగాడు సోందొర.

సోందొరకీ, చిదంబరానికీ' చాలా కాలంగా పరిచయముంది. సోందొర చెప్పింది నిజమే అయ్యుంటుదన్న నమ్మకంతో వేరు ప్రశ్నలు వెయ్యకుండా టెలిఫోన్ దగ్గరకు పరుగెత్తి అటు గోపాలపట్నానికీ, ఇటు అనకాపల్లికి ఫోన్లు చేసి జరిగిన సంగతి టూకీగా చెప్పి, అన్ని ట్రైన్లకీ సిగ్నల్స్ యివ్వకుండా ఎక్కడికక్కడే ఆపుచేయించమని కోరాడు. ఆ తర్వాత బల్లమీదనున్న నీళ్ళ సీసాని సోందొర చేతికందించాడు. అప్పటికి కాస్త సేదదీరిన సోందొర రెండు గుక్కెళ్ళు నీళ్ళు త్రాగి, కనురెప్పలు మూసుకుని స్థిమితపడ సాగాడు.

"నిజంగా దేవుడిలా సమయానికొచ్చి రక్షించావు! ఇంకొక్క ఇరవై నిముషాల్లో హైదరాబాద్ నుంచి విశాఖ వైపు వెళ్ళే ఎక్స్‌ప్రెస్సూ, విశాఖ నుంచి గుజరాత్ వెళ్ళే స్పెషల్ ట్రైనూ వెళ్ళవలసిన సమయం. ఈ రెండూ ఘోర ప్రమాదాలకి గురై ఉండేవి! అదృష్టవశాత్తూ ఎక్స్‌ప్రెస్ ఇంకా అనకాపల్లి చేరలేదు. దాన్నక్కడికి రాగానే ఆపేస్తారు. అరడజను పాసింజర్ బోగీలతోనూ,

పధ్నాలుగు గూడ్సు వాగన్లతోనూ భూకంప బాధితుల బంధువుల్నీ, సహాయార్థం పంపుతున్న సరుకుల్నీ తీసుకుపోతున్న, ఈ స్పెషల్ ట్రైన్ ఏదో కారణంగా గోపాలపట్నం ఆవుటర్ సిగ్నల్ దగ్గర ఆగి ఉందట! ఎంతోమంది నీకు ఋణపడి ఉంటారు" అన్నాడు చిదంబరం.

సోందొర ఏదో మాట్లాడబోతే వారించాడు చిదంబరం. జేబులోని రుమాలు తీసి నీళ్ళతో తడిపి, సోందొర వంటిమీది గాయాల్ని తుడవసాగాడు. అంతలో టెలిఫోను మ్రోగింది. చిదంబరం బల్ల దగ్గరకు వెళ్ళి రిసీవర్ అందుకొన్నాడు. ఓ ఐదు నిముషాలు విని, ఆ తర్వాత సోందొరకి వివరాలు చెప్పాడు.

"అనకాపల్లి నుంచి గాంగ్ కూలీలతో ట్రాక్ ఇంజనూ, విశాఖ నుంచి కొంతమంది సిబ్బందితో ఓ పైలట్ ఇంజనూ బయలుదేరుతున్నాయి. ఇంక మిగిలిందంతా వాళ్ళే చూసుకుంటారు".

గుండె ఫలకాల మీద దేశాల భారం మోస్తున్న భూమాత ఒత్తిడి భరించలేక ఓసారి మూలిగి సర్దుకుంటే, గుజరాత్ భూకంపంతో దదదడలాడింది. ఆ తల్లి చర్యకు బలైన ప్రజలూ, వికలాంగులుగా మిగిలినవారూ, అయినవారినీ, ఉన్నవాటినీ సమస్తమూ కోల్పోయి నడిరోడ్డున పడున్న జనాలూ దేశదేశాల ప్రజల హృదయాల్ని ద్రవింపజేశారు. సామాన్య జనులూ, సకల సంస్థలూ సహకారమందించిన తరుణంలో, తన రాష్ట్రం పంపిస్తున్న సహాయాన్ని గమ్యం చేరేటట్టు రక్షించిన సోందొర, అనిర్వచనీయమైన తృప్తి నరనరాల్లోనూ ప్రవహిస్తుండగా నిద్రలోకి జారుకున్నాడు.

తూర్పు తెల్లవారేసరికి లైన్లు రిపేరు కావడం, ట్రైన్లు కదలడం జరిగింది. అదే ఎక్స్‌ప్రెస్ ట్రైన్లో హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకొన్నారు - రాజయ్యదొరకి అప్పిచ్చిన ఋణదాత మల్లపరాజూ, వేలంపాటలో ఆ భూమిని కొందామన్న ఉద్దేశ్యంతో ఉన్న గుజరాతీ సేఠ్ చమన్‌లాల్ పటేలూ. వాళ్ళిద్దరూ విశాఖ నుంచి మళ్ళీ కార్లో బయలుదేరి జొన్నచేను చేరుకున్నారు. రాజయ్యదొర చెక్క కిరువైపులా అతని పొలాల్ని ఇదివరకు కొన్న కొంతమంది రైతులూ, అనకాపల్లి నుంచి, విశాఖ నుంచి మరికొందరు వ్యాపారులూ ఆ పాట కొచ్చారు. అచేతనంగా నిలబడ్డ రాజయ్యదొర ముందు కోర్టు ప్రతినిధులు వేలం మొదలు పెట్టారు. అరగంటలో వేలం ముగిసింది.

ఎందరో ప్రాణాల్ని కాపాడింది రాజయ్యదొర కొడుకు సోందొరేనని, చిదంబరం వాఙ్మూలం ద్వారా రైల్వే అధికారులకీ, పత్రికలకీ, ప్రజలకీ ఆ సాయంత్రానికి తెలిసింది.

ఆ రక్షించబడ్డవాళ్ళలో తామూ ఉన్నామని, సోందొరకి తామీ విషయంలో ఋణపడి ఉన్నామని గ్రహించిన ఋణదాత మల్లపరాజూ, పాట నెగ్గిన సేఠ్ చమన్‌లాల్ పటేలూ, పత్రికా విలేకరులూ, రైల్వే అధికారులూ ఆ మర్నాడు రాజయ్యదొర ఇంటికి వెళ్ళేసరికి ఆలస్యమే అయిపోయింది. వాళ్ళందరూ ఏ విధంగా సోందొర ఋణం తీర్చుకొనేవారో తెలియదుకాని, ఎన్ని దట్టమైన పొరల అడుగు నుంచో, ఎన్ని చీకటితెరల వెనుకనుంచో కల్లోలం సృష్టిద్దామనుకొన్న సంఘవిద్రోహక శక్తులు, తమ దారికి అడ్డువచ్చాడన్న ఆగ్రహంతో అప్పటికే సోందొరకి మరణశిక్షని ప్రసాదించాయి!